





ఢిల్లీలో 'వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్' అవార్డు పొందుతున్న జీసీసీ ఎండీ జి.సురేశ్‌కుమార్. (ఇన్‌సెట్‌లో) అవార్డుతో జీసీసీ ఎండీ సురేశ్‌కుమార్

వైసీపీలో అసంతృప్తి సెగలు

ఎంపీ మాధవిని అరకు అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించడంపై ఆగ్రహం

పలు మండలాల్లో పార్టీ నాయకుల నిరసనలు

స్థానికుల్లో ఎవరికి టికెట్ కేటాయించినా గెలిపించుకుంటామని వెల్లడి

అధిష్ఠానం స్పందించకపోతే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరిక



అరకులోయలో వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

అరకులోయ, జనవరి 3: రానున్న ఎన్నికల్లో వైసీపీ అధిష్ఠానం అరకులోయ అసెంబ్లీ టికెట్‌ను ఎంపీ జి.మాధవికి ఇస్తున్నట్టు ప్రచారం జరగడంతో స్థానిక పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి నెలకొంది. స్థానికేతురాలైన మాధవి వద్దు.. స్థానికులే ముద్దు అని నినాదాలు చేస్తూ అరకులోయలో అంబేడ్కర్ విగ్రహం నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు పార్టీ స్థానిక నాయకులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతగిరి, హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలులో కూడా ఆందోళనలు చేపట్టారు.

అరకులోయ నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైసీపీ నేతలు, ఆశావహులైన సమర్డి రఘునాథ్, హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, హుకుంపేట మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్ మాట్లాడుతూ స్థానికేతరులకు టికెట్ కేటాయించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. స్థానికుల్లో ఎవరికి టికెట్ కేటాయించినా తాము గెలిపించుకుంటా మన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అరకు అసెంబ్లీ టికెట్‌పై పునరాలోచించి స్థానికుల్లో ఎవరికైనా టికెట్ కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మాజీ జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, కోడ సింహాద్రి, నాయని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో రాస్తారోకో చేస్తున్న వైసీపీ ప్రజాప్రతినిధులు

అనంతగిరిలో..

మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ మండల అధ్యక్షుడు స్వామి ఆధ్వర్యంలో పార్టీ మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు నిరసన చేపట్టారు. స్థానికేతరులకు అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో పలువురు ఆశావహులు, పార్టీకి అంకిత భావంతో పనిచేసిన వారు ఉన్నారని, అటువంటి స్థానిక నేతల్లో ఒక్కరిని ఇన్‌చార్జిగా నియమించాలన్నారు. లేకుంటే తామంతా పనిచేసేందుకు సిద్ధంగా లేమన్నారు. స్థానికుల్లో ఏ సామాజిక వర్గానికి టికెట్ ఇచ్చినా తామంతా పని చేస్తామని, ఈ మేరకు పార్టీ అధిష్ఠానానికి తీర్మానం పంపుతున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు రేగబోయిన స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు శెట్టి లక్ష్మణరావు, కోనాపురం సర్పంచ్ గుబాయి అప్పలమ్మ, రఘునాథ్, డొంబు, చిలకలగెడ్డ ఎంపీటీసీ సభ్యురాలు తడబారికి మితుల, పెదబిడ్డ సర్పంచ్ సాలేపు పెంటమ్మ, బీంపోలు ఎంపీటీసీ సభ్యుడు సిరగం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: అరకు అసెంబ్లీ సమన్వయకర్తగా ఎంపీ గొడ్డేటి మాధవిని పార్టీ అధిష్ఠానం నియమించడంపై వైసీపీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం వీరంతా డుంబ్రిగుడ మూడు రోడ్ల జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. స్థానికేతరులు వద్దు.. స్థానికులే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నాయకులను సమన్వయకర్తగా నియమించకుండా, వేరే నియోజకవర్గం నుంచి ఎంపీ మాధవిని సమన్వయకర్తగా నియమించడం సరికాదన్నారు. దీనిపై అధిష్ఠానం పునరాలోచించి సమన్వయకర్త మార్పుపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మండలంలో వైసీపీ నుంచి గెలుపొందిన ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనందరావు, సర్పంచులు వెంకటరావు, నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ స్వర్రు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, నాయకులు సింహాచలం, కృష్ణారావు, గోపాల్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెదబయలులో వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైసీపీ నేతలు

హుకుంపేటలో..

హుకుంపేట: మండలంలోని వైసీపీ నాయకులు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ మాధవిని అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంపై తమ వ్యతిరేకతను ... మిగతా 8వ పేజీలో

అరకు ఎంపీపీ రాజీనామా!



అరకు ఎంపీపీ ఉషారాణి

అరకులోయ: స్థానికేతురాలైన ఎంపీ మాధవిని అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంపై నిరసన వ్యక్తం చేస్తూ అరకులోయ ఎంపీపీ రంజుపల్లి ఉషారాణి పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. నియోజకవర్గంలో శక్తి వంచన లేకుండా పని చేసే వారుండగా ఎంపీ మాధవిని ఇన్‌చార్జిగా నియమించడం పార్టీ నియోజకవర్గ నేతలను అవమానించినట్టు అయిందని బుధవారం విడుదల చేసిన ఓ వీడియో సందేశంలో ఆమె పేర్కొన్నారు.

అరకు కాఫీకి అరుదైన గుర్తింపు

'వన్ డిస్ట్రిక్ట్...వన్ ప్రొడక్ట్' పేరిట కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో బంగారు పతకం కైవసం



పాడేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో వివిధ జిల్లాల్లో ప్రాచుర్యం పొందిన ఉత్పత్తులకు 'వన్ డిస్ట్రిక్ట్..వన్ ప్రొడక్ట్' పేరిట ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అరకు కాఫీకి బంగారు పతకం లభించింది. జిల్లాల్లో ఓ ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులకు జనంలో మంచి గుర్తింపు ఉంటున్నది. దీంతో ఆయా ఉత్పత్తులను ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాల్లో వున్న ప్రత్యేక ఉత్పత్తుల వివరాలను గత ఏడాది సెప్టెంబరులో సేకరించింది. అక్టోబరు నెలలో ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక ఉత్పత్తుల పరిశీలన జరిపింది. ఆ విధంగా గత ఏడాది అక్టోబరు 14న కేంద్ర బృందం సభ్యులు పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో పర్యటించి ఇక్కడ కాఫీ సాగు, తదితర వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావులను అడిగి తెలుసుకున్నారు. కాగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన 'వన్ డిస్ట్రిక్ట్..వన్ ప్రొడక్ట్' ఎంపిక ప్రక్రియకు దేశవ్యాప్తంగా 64 ఉత్పత్తులు రాగా, వాటిలో 14 ఉత్పత్తులకు గుర్తింపు లభించింది. వాటిలో మన రాష్ట్రం నుంచి ఎంపికైన ఆరు ఉత్పత్తుల్లో అరకు కాఫీ ఒకటి కావడం విశేషం. మన్యం కాఫీకి బంగారు పతకం లభించింది. ఈ కార్యక్రమానికి జీసీసీ ఎండీ జి.సురేశ్‌కుమార్ హాజరై కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్‌గోయల్ నుంచి 'వన్ డిస్ట్రిక్ట్..వన్ ప్రొడక్ట్' గుర్తింపు అవార్డును స్వీకరించారు. అరకు కాఫీకి కేంద్ర గుర్తింపు లభించడంపై కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, కాఫీ విభాగం అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే మన్యంలో కాఫీ మొక్కల పెంపకంలో గాని, కాఫీ గింజల మార్కెటింగ్‌లోగాని ఎటువంటి సేవలు అందించని జీసీసీ ఎండీని కేంద్ర అవార్డు స్వీకరణకు పంపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పాడేరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కదంతొక్కిన అంగన్‌వాడీలు

సర్కారు బెదిరింపులకు నిరసనగా కలెక్టరేట్ ముందు ధర్నా

పాడేరుకు భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, ఆయాలు

ప్రభుత్వ మొండి వైఖరిపై తీవ్ర ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌పై సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం వివిధ రూపాల్లో బెదిరింపులకు పాల్పడడాన్ని నిరసిస్తూ బుధవారం కలెక్టర్ ముట్టడి కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. కలెక్టరేట్‌ల ముట్టడికి సంఘం పిలుపునివ్వడంతో ఏజెన్సీలోని అన్ని మండలాల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు జిల్లా కేంద్రానికి ఉదయం ఎనిమిది గంటల నుంచే చేరుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి సమీపంలోని ఓ ప్రదేశానికి చేరుకుని అక్కడి నుంచి సుమారుగా కిలో మీటరున్నర దూరంలో వున్న కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివెళ్లారు. అంబేడ్కర్ కూడలి నుంచి సినిమా హాల్ సెంటర్, పీటీడీ కాంప్లెక్స్ మీదుగా కలెక్టర్ కార్యాలయానికి ఈ ర్యాలీ సాగింది. కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద అంగన్‌వాడీలను పోలీసులు అడ్డగించడంతో ప్రధాన గేటు వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ ధర్నా చేపట్టి తమ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ బెదిరింపులకు భయపడబోమని నినాదాలు చేశారు. అనంతరం తమ డిమాండ్లపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

సర్కారు మొండి వైఖరి వల్లే..

సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరి కారణంగానే ... మిగతా 8వ పేజీలో



విమానాశ్రయంలో భువనేశ్వరితో టీడీపీ నేతలు

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

విశాఖపట్నం, జనవరి 3: మూడు రోజుల ఉత్తరాంధ్ర పర్యటన కోసం బుధవారం నగరానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో మన స్తాపంతో ప్రాణాలు విడిచిన వారి కుటుంబాలను ఆమె పరామర్శించి సాయం ... మిగతా 8వ పేజీలో

మన్యంపై మంచు దుప్పటి

కొనసాగుతున్న చలి తీవ్రత

అరకులోయ, చింతపల్లిలో 10, పాడేరులో 10.9 డిగ్రీలు



ముంచంగిపుట్టులో బుధవారం ఉదయం 9 గంటల సమయంలో పొగ మంచు



పాడేరు-చింతపల్లి మెయిన్ రోడ్డులో బుధవారం ఉదయం పొగ మంచు

పాడేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ చలి తీవ్రత, పొగమంచు కొనసాగుతున్నది. అరకులోయ, చింతపల్లిలో 10, పాడేరులో 10.9 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. శీతాకాలం నేపథ్యంలో మరి కొన్ని రోజులు చలి వాతావరణం కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచిస్తున్నది. ప్రస్తుతం శీతాకాలం, ఉత్తరాది నుంచి చలిగాలులు వీస్తుండడంతో చలి తీవ్రత కొనసాగుతున్నది. దీంతో మన్యంలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగ మంచు కురుస్తున్నది. దీని వల్ల ఏజెన్సీలో రోడ్లు స్పష్టంగా కనిపించకపోవడంతో హెడ్ లైట్లు వేసుకుని వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా మాత్రమే ఎండ కాస్తూ, సాయంత్రం మూడు గంటల నుంచే చలి ప్రభావం మొదలవుతున్నది. దీంతో ఏజెన్సీ వాసులు వణుకుతున్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో చలి తీవ్రత పెరిగింది. బుధవారం చింతపల్లిలో 10.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ ... మిగతా 8వ పేజీలో

420 కిలోల గంజాయి స్వాధీనం
ఆరుగురి అరెస్టు 7

ఎన్నికల్లో జోనల్ అధికారులది కీలక పాత్ర

పాడేరు నియోజకవర్గ జోనల్ అధికారుల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో జోనల్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై పాడేరు నియోజకవర్గం జోనల్ అధికారులకు ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో జోనల్ అధికారులు కీలకంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో జోనల్ అధికారులు నిర్వహించాల్సిన బాధ్యతలు, విధి విధానాలపై కలెక్టర్ అవగాహన కల్పించారు. జోనల్ అధికారులు చేయాల్సినవి, చేయకూడని పనులను వివరించారు. ఎన్నికల జోనల్ అధికారులు స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారాలు కలిగి ఉంటారని, ఎన్నికల విధుల్లో నిర్వహించాల్సిన పనులపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ సమర్థవంతంగా నిర్వహించే బాధ్యత, పోలింగ్ పార్టీల లభ్యత, ఎన్నికల సామగ్రి, భద్రతా సిబ్బంది సమన్వయంతో ఎన్నికల నిబంధనలను అమలు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది, ఈవీఎంలు సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలించడం, తిరిగి సకాలంలో వచ్చేలా పక్కాగా చర్యలు చేపట్టాలన్నారు. ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బందిపై పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వాహనాలను మార్గమధ్యంలో ఎక్కడా నిలుపుదల చేయకూడదని, పోలింగ్ ప్రక్రియ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందన్నారు. మాక్ పోలింగ్, పోలింగ్ ప్రారంభంపై అవగాహనతో పాటు ప్రిసైడింగ్ అధికారులు డైరీ సక్రమంగా నిర్వహించి ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలన్నారు. రానున్న 20 రోజుల్లో జోనల్ అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో రోడ్లు, రవాణా సదుపాయాలను పరిశీలించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, సబ్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వీవీ రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ లీలాకృష్ణ, పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని జోనల్ అధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

420 కిలోల గంజాయితో ఆరుగురి అరెస్టు

పెదబయలు, జనవరి 3: ఒడిశా నుంచి ఏజెన్సీ మీదుగా మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 420 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు బుధవారం రూడకోట కూడలిలో వాహనాల తనఖీ చేపట్టారు. ఒడిశా వైపు నుంచి వస్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 420 కిలోల గంజాయి లభించింది. వాహనంలో వున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరు ఒడిశా రాష్ట్రం సిమిలిగుడకు చెందిన గబులు, నీలం, మరో మైనర్; ముంచంగిపుట్టు మండలం కుమడ పంచాయతీ చీపురుగొంది గ్రామానికి చెందిన భాస్కరరావు, బోసుబాబు, రామారావుగా గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కోడి పందాల శిబిరంపై దాడి, నలుగురి అరెస్టు

బుచ్చెయ్యపేట, జనవరి 3: వడ్డాది శివారులో కోడి పందాల శిబిరంపై బుధవారం పోలీసులు దాడిఇ చేశారు. నలుగురిని అరెస్టు చేసి, ఒక కోడిపుంజు, రూ.4,180 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి.ఈశ్వరరావు మాట్లాడుతూ, సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, పేకాట, గుళ్లాట వంటి జూదాలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి విశాఖలో కథా నాటిక పోటీలు

విశాఖపట్నం, జనవరి 3: తెలుగు సాహిత్యం, సంస్కృతిని ప్రతిబింబించేలా అజో- విభో-కందాళం ఫౌండేషన్, రైటర్స్ అకాడమీల ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు కథానాటిక పోటీలను నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పాజోశ్యుల సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణమూర్తి తెలిపారు. విశాఖ పౌరగ్రంథాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అజో-విభో 31వ వార్షికోత్సవం సందర్భంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలో పాల్గొనేందుకు మొత్తం 29 నాటికలు వచ్చాయని వాటిలో తొమ్మిదింటిని ఎంపిక చేసి, ప్రతిరోజూ మూడు ప్రదర్శనల చొప్పున ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 7వ తేదీన 'సరిలేరు నీకెవ్వరు' పురస్కారాన్ని మల్లిపురం జగదీష్, విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని రేవూరి అనంతపద్మరావుకు, ప్రతిభామూర్తి పురస్కారాన్ని ఎల్లపు ముకుంద రామారావులకు అందజేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి: కలెక్టర్

అనకాపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్ కేంద్రాల పరిస్థితిని తనిఖీ చేసి, మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో ఇప్పటి వరకు అందిన మార్పులు, చేర్పులు, తొలగింపులు దాదాపు పూర్తికావచ్చాయని చెప్పారు. ఇక నుంచి జిల్లాలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను తనిఖీ చేయనున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, నీరు, వికలాంగులకు ర్యాంపు మొదలైన వసతులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అవసరమైన చోట్ల అదనపు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గురించి కూడా పరిశీలన చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌వో బి.దయానిధి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు(టీడీపీ), ఎస్‌వీవీ.రామచంద్రరావు(బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలపై జీసీసీ చైర్‌పర్సన్‌కు వినతి

విశాఖపట్నం, జనవరి 3 : జీసీసీ హమాలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజన కలాసీల వెల్ఫేర్ సొసైటీ (ఏఐటీయూసీ అనుబంధం) సభ్యులు రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీసీసీని నమ్ముకుని హమాలీలు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా.. కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పదవీ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబానికి దహన ఖర్చులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, హమాలీల సంఘం నాయకులు పండు బాబు, లగుడు సీతయ్యనాయుడు, సుబ్బారావు, స్వామి, ఎం.రాజబాబు, పి.పరశురాం, చందు, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా సికింద్రాబాద్, బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, జనవరి 3: సంక్రాంతి రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా సికింద్రాబాద్, బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 07093 నంబరు గల రైలు ఈనెల 8, 15 తేదీల్లో రాత్రి 7.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, 11.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07094 నంబరు గల రైలు ఈనెల 9, 16న మధ్యాహ్నం 12.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 6.00 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అ న్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, పలాస, సోంపేట, ఇచ్చాపురం, బ్రహ్మపూర్ మధ్య రాకపోకలు సాగిస్తాయి.

ఉదయ్ ఎక్స్‌ప్రెస్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు పునరుద్ధరణ

విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న భద్రతా నిర్మాణ పనుల నేపథ్యంలో రద్దు చేసిన ఉదయ్ ఎక్స్‌ప్రెస్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించినట్టు త్రిపాఠి తెలిపారు. దీంతో విజయవాడ, విశాఖ మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను (22702/22701) ఈనెల 5వతేదీనుంచి 13వ తేదీ వరకు, అలాగే గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239) రైలు ఈనెల పది నుంచి 14వ తేదీ వరకు, విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240) రైలు ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

డీసీసీబీ సీఈవో నియామకంలో అక్రమాలు

» సహకార రిజిస్ట్రార్‌కు విశ్రాంత ఉద్యోగుల ఫిర్యాదు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవోగా డీవీఎస్ వర్మను మూడోసారి నియమించడంలో అక్రమాలు జరిగాయని కొందరు బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు సహకారశాఖ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదుచేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా సీఈవో పోస్టులో వర్మను కూర్చోబెట్టారని ఫిర్యాదులో ఆరోపించారు. ప్రభుత్వం నామినేట్ చేసిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చేపట్టిన సీఈవో నియామకం చెల్లదని, కమిటీకి ఆ అధికారం లేదని ఫిర్యాదులో వివరించారు. గత ఏడాది జూలై 13న సీఈవోను నియమించేందుకు అప్పటి పర్సన్ ఇన్‌చార్జి చింతకాయల అనిత అధ్యక్షతన బోర్డు తీర్మానించడం నుంచి సెప్టెంబరు 17న సీఈవోగా వర్మ మూడోసారి బాధ్యతలు స్వీకరించే వరకు గోప్యత పాటించడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. బ్యాంకు ఖాతాదారులు, అనుబంధ సంస్థలకు తెలిసేలా సీఈవో నియామక ప్రకటన చేయాల్సి ఉండగా, దొడ్డిదారిన చేపట్టారన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులది కీలక పాత్ర

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి టౌన్, జనవరి 3: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారుల పాత్ర కీలకమైనదని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బుధవారం స్థానిక ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో సెక్టార్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడారు. వీరికి మెజిస్ట్రీరియల్ అధికారాలు ఉంటాయన్నారు. ఎన్నికల జిల్లా అధికారి, జిల్లా ఎస్పీలకు ప్రతినిధులుగా సెక్టార్ అధికారి, సెక్టార్ పోలీస్ అధికారి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వల్నరబుల్ (దుర్బల) పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించవలసి ఉంటుందన్నారు. అంతకుముందు జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం ఎక్కువగా ఉండి వాటిలో ఎక్కువశాతం ఒకే అభ్యర్థికి ఓట్లు వచ్చినట్లయితే, ఓటర్లను బెదిరించడం, ఓట్లు వేయడానికి లేకపోతే వేయకుండా భయం కల్పించడం, పోలింగ్‌లో పాల్గొనడానికి ఓటర్లే అనాసక్తతతో ఉండడం వంటి పోలింగ్ కేంద్రాల ప్రాంతాలను గుర్తించాల్సి ఉంటుందన్నారు. అటువంటి పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో ఓటర్లను చైతన్యపరచడం, వారి ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు అవసరమైన వాతావరణం కల్పించాలన్నారు. ఎన్నికల్లో పాల్గొనే అధికారులు పీవోలు, ఏపీవోలతో సమన్వయం చేసుకుంటూ ఉండాలన్నారు. ఓటర్లను చైతన్యపరిచేందుకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు 16 మంది వివిధ నోడల్ అధికారులు ఉంటారని తెలిపారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రశాంత, నిష్పక్షపాత ఓటింగ్ సరళి చేపట్టే విధంగా సెక్టార్ అధికారులు ప్రణాళికతో ముందస్తు పరిస్థితిని కల్పించాలన్నారు. ఆ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, సంఘ వ్యతిరేక కార్యక్రమాలు మొదలైన వాటిని గుర్తించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను అనుసరిస్తూ ప్రశాంత వాతావరణం కల్పించాలని సూచించారు. ముందుగా వివిధ ఎన్నికల నిర్వహణ అధికారుల సమన్వయంతో నిష్పక్షపాత, ప్రశాంతమైన పోలింగ్ నిర్వహణకు సిద్ధం చేయాలన్నారు. తరువాత సెక్టార్ అధికారుల విధులు, నియమ నిబంధనలను గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో బి.దయానిధి, నర్సీపట్నం అడిషనల్ ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా, జిల్లాలోని ఆర్డీవోలు, ఎస్‌డీసీలు, ఏఈఆర్‌వోలు అయిన తహసీల్దార్లు, పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ధర్నా


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న చినబ్బాయి

అనకాపల్లి టౌన్, జనవరి 3: ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నెహ్రూచౌక్ బస్టాప్ వద్ద యూటీఎఫ్ బుధవారం 12 గంటల ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయి ఉన్న రూ.18 వేల 96 కోట్లను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడుగా ఉండగా రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తానని, మంచి పీఆర్‌సీ ఇస్తానని, టైమ్ టూ టైమ్ డీఏ ఇస్తానని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తానని వరాలు కురిపించి ఈ నాలుగున్నరేళ్లలో హామీలను నెరవేర్చకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుతం పదో తేదీ దాటితేనే గాని జీతాలు రాని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం దిగి రాకపోతే విజయవాడలో ఈ నెల తొమ్మిది, పది తేదీల్లో 36 గంటల పాటు ధర్నా నిర్వహించనున్నట్టు చినబ్బాయి చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఏకేవీ రామబ్రహ్మం, కట్టా శ్రీను, గాయిత్రి, జోగా రాజేశ్, జీఎస్ ప్రకాశ్, మామిడి అరుణ, డీఆర్‌కే శాస్త్రి, జీకేఆర్ స్వామి, ఎం.నానాజీ, కామరాజు, గిరి, సుభాషిణి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె



శిబిరంలో నినాదాలిస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, జనవరి 3: జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500లు వేతనాలు చెల్లించాలని వంటి పలు డిమాండ్లతో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బొమ్మల రాము, సంతోశ్, అజయ్‌కుమార్, నూకరాజు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో...

నర్సీపట్నం, జనవరి 3: పారిశుధ్య కార్మికుల సమ్మె బుధవారం 9వ రోజుకి చేరింది. కార్మికులు ఎన్టీఆర్ మినీ స్టేడియం రిలే దీక్షలు చేపట్టారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కరోనా సమయంలో తాత్కాలిక విధులు నిర్వహించిన పారిశుధ్య కార్మికులను విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన నియోజవర్గం ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, అద్దేపల్లి గణేశ్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.త్రిమూర్తులురెడ్డి, తదితరులు పారిశుధ్య కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.



రిలే దీక్షలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జగనన్న కాలనీలో ఖాళీ స్థలాలు కబ్జా

» దర్జాగా ఇళ్ల నిర్మాణం.. పట్టించుకోని రెవెన్యూ అధికారులు


జగనన్న కాలనీలో ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి చేపట్టిన ఇంటి నిర్మాణం

చోడవరం, జనవరి 3: జగనన్న కాలనీల్లో మిగులు స్థలాలను కొంతమంది కబ్జా చేసి, ఇళ్లు నిర్మించుకుంటున్నారు. పట్టణ శివారు చీడికాడ రోడ్డులోని కాలనీలో చివర మూలన రెండు స్థలాలు మిగిలిపోయాయి. సుమారు ఐదు సెంట్లు వుండడంతో సామాజిక అవసరాలకు ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో అప్పట్లో రెవెన్యూ అధికారులు వదిలేశారు. దీనిపై కన్నేసిన ఓ వ్యక్తి సుమారు సగం స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీనిని చూసి మరో వ్యక్తి మిగిలిన సగం స్థలాన్ని ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్నాడు. కాగా స్థలాల కబ్జాపై అన్నవరం గ్రామానికి చెందిన వెంపలి సీతారామయ్య స్పందనలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఇంతవరకు పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

వైసీపీ నుంచి సర్పంచ్ దంపతుల సస్పెన్షన్

పరవాడ, జనవరి 3: మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు దంపతులను వైసీపీ నుంచి సస్పెండ్ చేసినట్టు పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కోన రామారావు బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో నిర్వహించిన పంచాయతీరాజ్ సదస్సులో సర్పంచ్ భర్త ముత్యాలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మీద, ప్రభుత్వం మీద టీడీపీ నాయకుల ముందు అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు సర్పంచ్‌తో పాటు ఆమె భర్తను పార్టీ నుంచి బహిష్కరించామని ఆ ప్రకటనలో వెల్లడించారు.

2,67,651 మందికి పింఛన్ కానుక

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



వైఎస్సార్ పింఛన్ కానుక నమూనా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

అనకాపల్లి రూరల్, జనవరి 3: జిల్లాలో 2,67,651 మందికి రూ.77 కోట్ల 90 లక్షల 94 వేలు పింఛన్ కానుక అందిస్తున్నట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కాకినాడ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకరంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితో పాటు చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ వీక్షించారు. అనంతరం జిల్లాలోని లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు, సచివాలయ ప్రత్యేక అధికారి మంజులావాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చోడవరం సీహెచ్‌సీ వైద్యాధికారిపై విచారణ


ఆస్పత్రిలో విచారణ జరుపుతున్న నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణి

చోడవరం, జనవరి 3: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తుండడంతోపాటు ప్రైవేటు ప్రాక్టీసు చేస్తున్నారంటూ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) వైద్యాధికారి వినయ్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై బుధవారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణి ఇక్కడ విచారణ చేపట్టారు. వైద్యాధికారి వినయ్‌కుమార్ డ్యూటీ సరిగా చేయడం లేదని, రోగులను నిర్లక్ష్యం చేస్తున్నారంటూ అందిన ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేయడానికి వచ్చినట్టు ఆమె చెప్పారు. పనివేళల్లో వైద్యాధికారి ఆస్పత్రిలో ఉంటున్నారా, లేదా అని రోగులను, వైద్య సిబ్బందిని ఆమె ప్రశ్నించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్టు ఆమె తెలిపారు.





పాడేరు కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న అంగన్‌వాడీలు

కదంతొక్కిన అంగన్‌వాడీలు

... 5వ పేజీ తరువాయి

వారిలో పోరాట పటిమ అధికమైందని తెలుస్తున్నది. అందువల్లే బుధవారం కలెక్టర్ ముట్టడి కార్యక్రమానికి భారీ స్థాయిలో అంగన్‌వాడీలు హాజరై సంపూర్ణంగా విజయవంతం చేశారని సంఘం నేతలు అంటున్నారు. కాగా అంగన్‌వాడీలు సమ్మెను విరమించి ఈ నెల ఐదో తేదీలోగా విధుల్లో చేరకుంటే, ప్రత్యామ్నాయం చూసుకుంటామని ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా ప్రకటనలు ఇప్పించడంపై అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. గతంలోనూ అక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకోవడం, సచివాలయ సిబ్బందితో నడపాలని భావించి భంగపడడం, ఆ తరువాత సమీపంలోని పాఠశాలల్లో చిన్నారులకు పోషకాహారాన్ని అందించే ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కకపోవడంతో ప్రభుత్వం తాజాగా కలెక్టర్లతో అంగన్‌వాడీలకు పరోక్ష హెచ్చరికలు చేయించింది. అయినప్పటికీ అంగన్‌వాడీలు ఎక్కడా తగ్గకుండా కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేసి తమ సత్తాను చాటారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె బుధవారానికి 23వ రోజుకు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె 14వ రోజుకు చేరింది. దీంతో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు ధర్నా చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్ర


కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

పాడేరు రూరల్: అంగన్‌వాడీల ధర్నా కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను రోడ్డున పడేసి పైశాచిక ఆనంద పొందే మొట్టమొదటి సీఎం జగన్మోహన్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.నాగమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.చిన్నయ్యపడాల్, వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ప్రాజెక్టు నాయకులు వెంకటలక్ష్మి, రాజమ్మ, కొండమ్మ, మంజుల, నర్సమ్మ, అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు డి.గంగరాజు, సీఐటీయూ జిల్లా నాయకులు బి.సన్నిబాబు, ఎస్.శంకరరావు, సత్యనారాయణ పడాల్, మోసియ, ఎల్.సుందరరావు, గిరిజన సంఘం నాయకులు పి.బాలదేవ్‌తో పాటు పాడేరు డివిజన్ 11 మండలాలకు చెందిన సుమారు రెండు వేల మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అప్రమత్తమైన పోలీసులు

అంగన్‌వాడీలు కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఐ సుధాకర్ పర్యవేక్షణలో ఎస్ఐలు జి.లక్ష్మణరావు, జి.రంజిత్‌కుమార్ సిబ్బందితో కలెక్టర్ కార్యాలయం వద్దకు బుధవారం ఉదయం 10 గంటలకే చేరుకొని భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. రోప్ పార్టీని ఏర్పాటు చేసి కలెక్టర్ కార్యాలయానికి 100 అడుగుల అవతల నుంచే అంగన్‌వాడీలను నిరోధించారు.

వైసీపీలో అసంతృప్తి సెగలు

... 5వ పేజీ తరువాయి

తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సింహాచలం, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో...

పెదబయలు: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైసీపీ మండల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎంపీ మాధవిని నియమించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎంపీ మాధవి ఏనాడూ స్థానిక నేతలను కలవలేదని, కనీసం అరకులో అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. అధిష్ఠానం పునరాలోచించి స్థానికులకు టికెట్ కేటాయిస్తే అందరం సమష్టిగా గెలిపించుకుంటామన్నారు. అలా కాని పక్షంలో నియోజకవర్గంలోని వైసీపీ నాయకులంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కె.బొంజుబాబు, మాజీ ఎంపీపీలు గంపరాయి సూరయ్య, ఉమామహేశ్వరరావు, నాయకులు గంగభవాని, భీముడు, ఆనందరావు, సింహాచలం, సూర్యనారాయణ, కృష్ణారావు, అనిత, లక్ష్మి, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

మన్యంపై మంచు దుప్పటి

... 5వ పేజీ తరువాయి


లంబసింగి-చింతపల్లి మార్గంలో కురుస్తున్న మంచు

వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. ఐదు రోజుల కిందట ఏక సంఖ్యలో నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. మంగళవారం చింతపల్లిలో 15.5 డిగ్రీలు నమోదు కాగా, బుధవారం ఒకేసారి ఐదు డిగ్రీలు పడిపోయింది. దీంతో మరోసారి గిరిజన ప్రాంతంలో చలి తీవ్రత భారీగా పెరిగింది. చలితో పాటు గిరిజన గ్రామాల్లో మంచు దట్టంగా కురుస్తున్నది. అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు పదిన్నర గంటల వరకు మంచు వీడడం లేదు. దీంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణిస్తున్నారు. శీతల గాలులు సాయంత్రం నాలుగు గంటల నుంచే ప్రారంభం కావడంతో ప్రజలు సాధారణ రోజులకంటే ముందుగానే ఇళ్లకు చేరుకుంటున్నారు. కాగా నెలాఖరు వరకు ఏజెన్సీ వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండల పరిధిలో చలి తీవ్రత కొనసాగుతోంది. బుధవారం ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. విధులకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 4 గంటల నుంచే చలి గాలులు మొదలు కావడంతో వృద్ధులు, చిన్నారులు వణికిపోతున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల బైఠాయింపు

- సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి
- కొనసాగుతున్న సమ్మె, నిరసనలు


సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేట్ వద్ద బైఠాయించిన ఉద్యోగులు


సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పాడేరు రూరల్, జనవరి 3: సమస్యల పరిష్కారం కోరుతూ 15 రోజులుగా సమ్మెను కొనసాగిస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. సమ్మె శిబిరం నుంచి సినిమాహాలు సెంటర్, అంబేద్కర్ కూడలి మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులను లోపలికి వెళ్లకుండా ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డగించడంతో, అక్కడే బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కాంతారావు మాట్లాడుతూ విద్యా ప్రమాణాల మెరుగుకు, విద్యా శాఖలో ప్రభుత్వ పథకాలను విద్యార్థులకు సకాలంలో సక్రమంగా అందించేందుకు కృషి చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. విద్యా రంగంలో పెనుమార్పులు తీసుకువచ్చి దేశంలోనే రాష్ట్రానికి ఎంతో గుర్తింపు తేవడంతో పాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి. వాటన్నింటినీ సక్రమంగా అమలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉద్యోగ సంఘం నాయకులు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అక్కడ నుంచి ర్యాలీగా వెనుదిరిగిన ఉద్యోగులు సమ్మెను కొనసాగించారు. 15వ రోజు సమ్మె శిబిరాన్ని సందర్శించిన బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు ఉద్యోగులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు వి.జయరాజు, ఎం.అనిల్ కుమార్, పి.సింహాచలం, గౌరీశంకర్, వెంకటరమణ దొర, సుభద్ర, అనంతలక్ష్మి, వివిధ మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలని ఉపాధ్యాయుల ధర్నా


ఐటీడీఏ ఎదురుగా 12 గంటల ధర్నా చేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

పాడేరు రూరల్, జనవరి 3: ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ ఎదురుగా బుధవారం యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా విజయవంతమైంది. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతీ నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని, పీఆర్సీకి ముందు, తరువాత ప్రకటించిన డీఏ బకాయిలు చెల్లించాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని వీడకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ధర్నా నిర్వహించే ముందు భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేష్, నాయకులు సీహెచ్.నాగేశ్వరరావు, ధర్మారావు, ఎస్.నాగేశ్వరరావు, చిట్టిబాబు, దేముడు, తేజోరావు, క్రిష్ణయ్య, విశ్వరాజ్, ఉదయ్ మనోహర్, వెంకటలక్ష్మి, జిల్లాలోని 22 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సైకో జగన్ దిగిపోతేనే గిరిజన గ్రామాల అభివృద్ధి

- టీడీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు నారాయణ


కరపత్రాలను పంపిణీ చేస్తున్న నియోజకవర్గ పరిశీలకుడు నారాయణరావు

చింతపల్లి, జనవరి 3: గిరిజన ప్రజలు అభివృద్ధి చెందాలంటే సైకో జగన్‌రెడ్డి గద్దె దిగిపోవాలని, మళ్లీ అధికారంలోకి చంద్రబాబు రావాలని టీడీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు రాజమండ్రి నారాయణ అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో బుధవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ఏ ఒక వర్గం ప్రజలకు కూడా మేలు జరగలేదని, ఏ ఒక్కరూ సంతృప్తిగా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాలు పదేళ్ల అభివృద్ధికి వెనక్కి వెళ్లిపోయిందన్నారు. గిరిజన ప్రజలు కనీస సదుపాయాలైన తాగునీరు, రహదారులు, విద్యా, వైద్యం అందక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల కోసం టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. బెస్ట్ అవేలబుల్ స్కూల్ పతకం రద్దు చేసి ఆదివాసీ విద్యార్థులు కార్పొరేటు విద్యను దూరం చేసిందన్నారు. అంత్యోదయ కార్డులను తొలగించిందని, ఒక్కరికి పక్కా గృహం కట్టించలేదని ఆరోపించారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఆదివాసీలు టీడీపీ అండగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తిపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

1,28,821 మందికి పెన్షన్ కానుక : ఎంపీ మాధవి


నమూనా చెక్కు అందిస్తున్న ఎంపీ మాధవి, కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లక్షా 28 వేల 821 మంది లబ్ధిదారులకు రూ.39.03 కోట్ల వైఎస్సార్ పెన్షన్ కానుక సొమ్ము విడుదలైందని అరకులోయ పార్లమెంటు సభ్యురాలు గొడ్డేటి మాధవి తెలిపారు. కాకినాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుక విడుదల సందర్భంగా బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు క్రమం తప్పకుండా అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జనవరి నెల నుంచి సామాజిక పింఛన్లను రూ.3 వేలకు ప్రభుత్వం పెంచిందన్నారు. జిల్లాలో అరకులోయ నియోజకవర్గంలో 39,602 మంది, పాడేరు నియోజకవర్గంలో 38,970 మంది, రంపచోడవరం నియోజక వర్గంలో 50,249 మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, వెలుగు ఏపీఎం ప్రసాద్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైసీపీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జిగా భాగ్యలక్ష్మి నియామకంపై హర్షం


భాగ్యలక్ష్మికి అభినందనలు తెలుపుతున్న నియోజకవర్గంలోని వైసీపీ శ్రేణులు

పాడేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని వైసీపీ అరకు పార్లమెంట్ నియోజవర్గ ఇన్‌చార్జిగా నియమించడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని గత ఏడాది వైసీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షురాలుగా నియమించారు. అలాగే తాజా ఇన్‌చార్జిల మార్పుల నేపథ్యంలో ఆమెను అరకులోయ పార్లమెంట్ స్థానానికి ఇన్‌చార్జిగా నియమించడంపై పాడేరు, అరకులోయ నియోజకవర్గాలకు చెందిన నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆమెను స్వయంగా కలిసి అభినందనలు తెలిపారు.

పంటల విలువ జోడించి మార్కెటింగ్ చేస్తే అధిక ఆదాయం: ఆత్మ పీడీ ఆశాదేవి

చింతపల్లి, జనవరి 3: ఆదివాసీ యువతీ, యువకులు గిరిజన ప్రాంతంలో పండించే పంటలకు విలువలు జోడించి మార్కెటింగ్ చేసుకోవడం వల్ల అధిక ఆదాయం పొందవచ్చునని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి చెప్పారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయపరిశోధన స్థానంలో ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేశ్ కుమార్ అధ్యక్షతన 'ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ'పై బుధవారం ఆదివాసీ యువతీ, యువకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై ప్రసంగించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వాతావరణం, నేలలు విభిన్నంగా ఉంటాయని, ఈ ప్రాంతంలో అరుదైన పంటల సాగుకు అనుకూలమని చెప్పారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసీ రైతులు సుంధ ద్రవ్య పంటలు పండుతున్నాయన్నారు. పంటలను ప్రాసెసింగ్ చేసుకోవడానికి వివిధ రకాల యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, వీటి ద్వారా పంటలకు విలువలు జోడించి ప్యాకింగ్ చేస్తే మార్కెటింగ్ చేసుకోవడం వల్ల స్వయం ఉపాధి పొందవచ్చని చెప్పారు. ఏడీఆర్ మాట్లాడుతూ ప్రధానంగా వలిసెల గింజల నుంచి ఆయిల్ సేకరించి మార్కెటింగ్ చేసుకోవచ్చునన్నారు. పనస, అనాసతో జామ్ తయారు చేయవచ్చునన్నారు. పసుపు పంటను పొడి చేసి ప్యాకింగ్ చేసి విక్రయించుకోవచ్చునన్నారు. ప్రాసెసింగ్ యంత్రాలకు బ్యాంక్‌లు రుణాలు కూడా మంజూరు చేస్తున్నాయన్నారు. శిక్షణ పొందిన యువతకు ధ్రుపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సీదరి ఉజ్వల రాణి, కేవీకే అగ్రికల్చర్ ఇంజనీర్ నిపుణులు పి.బాబు, శ్రీకాంత్ గౌడ్, డాక్టర్ ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆత్మ పీడీ ఆశాదేవి

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

... 5వ పేజీ తరువాయి

అందజేస్తున్నారు. ఆమె బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖపట్నం చేరుకున్నారు. ఆమెకు మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, కిడారి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్ధా వెంకన్న, విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నియోజకవర్గ ఇన్‌చార్జులుగా ఉన్న గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, గిడ్డి ఈశ్వరి, కోరాడ రాజబాబు, పార్టీ నేతలు పాశర్ల ప్రసాద్, పట్టాభి, తదితరులు స్వాగతం పలికారు.

భువనేశ్వరిని కలిసిన కిడారి శ్రావణ్, గిడ్డి ఈశ్వరి



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్... మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని పార్టీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి బుధవారం విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అయినప్పుడు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలువురు టీడీపీ నేతలు మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి విశాఖపట్నం వచ్చిన భువనేశ్వరిని కిడారి, ఈశ్వరి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. గిరిజన ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ స్థితిగతులు, తదితర అంశాలపై ఈ సందర్భంగా భువనేశ్వరికి శ్రావణ్‌కుమార్, ఈశ్వరి వివరించారు.

సంక్షిప్తంగా..

మాతృ భాషా విద్యా వలంటీర్లకు టైం స్కేల్ ఇవ్వాలి: అప్పలనర్స

పాడేరు రూరల్, జనవరి 3: రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆదివాసీ మాతృ భాషా విద్యా వలంటీర్లకు టైం స్కేల్ ఇవ్వాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన విద్యా వలంటీర్ల జిల్లా ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడుతూ వేతనాలు పెంచకుండా వెట్టి చాకిరీ చేయించడం అన్యాయమన్నారు. గిరిజన సబ్ ప్లాన్‌లో వారికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సహజ వనరులను దోచుకోవడంలో ఉన్న శ్రద్ధ, ఆదివాసీ యువతకు ఉపాధి కల్పించడంలో జగన్, మోదీ ప్రభుత్వాలకు లేదన్నారు. మాతృ భాసా వలంటీర్లను ఫిబ్రవరిలోనే రెన్యువల్ చేయాలని, ఆదివాసీల కోసం మెగా స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

సభ అనంతరం జిల్లా కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్.చిట్టిబాబు, ఉపాధ్యక్షులుగా కె.సర్బునాయుడు, కె.చిరంజీవి, ఎం.రాంబాబు, చిన్నారావు, ఎస్.కొండలరావు, ప్రధాన కార్యదర్శిగా పాంగి శ్రీను, సహాయ కార్యదర్శులుగా పి.కొండబాబు, ఎం.బాలరాజు, దేముడు, తాతబాబు, కోశాధికారులుగా ఎస్.సతీష్, వి.చంద్రయ్యతో పాటు 20 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మాతృ భాషా విద్యా వలంటీర్ల సంఘం జిల్లా నాయకులు కె.సర్బునాయుడు, సతీష్, చిట్టిబాబు, చంద్రయ్య, వీరయ్య, కుమారితో పాటు దాదాపు 300 మంది వలంటీర్లు పాల్గొన్నారు.

పులుసుమామిడిలో తాగునీటి ట్యాంక్ ధ్వంసం

జి.మాడుగుల, జనవరి 3: మండలంలోని బొయితిలి పంచాయతీ పులుసుమామిడి గ్రామంలో గ్రావిటీ తాగునీటి ట్యాంక్ ధ్వంసమైంది. గ్రామంలో 30 కుటుంబాలు వారు జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది ప్రభుత్వం గ్రావిటీ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించింది. ఇంతవరకు వినియోగంలో ఉన్నా.. బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మెయిన్ ట్యాంక్ ధ్వంసమైందని స్థానికులు తెలిపారు. నిర్మించి ఏడాదికే ధ్వంసం కావడంతో గిరిజనులు విస్మయానికి గురవుతున్నారు. మెయిన్ ట్యాంక్ ధ్వంసమవ్వడంతో గ్రామంలో తాగునీటి సమస్య నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి మరో ట్యాంక్ అమర్చి తాగునీటి ఎద్దడి నివారించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థి దశలోనే సైన్స్‌పై పట్టు సాధించాలి

చింతపల్లి, జనవరి 3: బాలబాలికలు విద్యార్థి దశలోనే సైన్స్‌పై పట్టు సాధించాలని ఏపీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామేశ్వరం చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం డివిజన్ స్థాయి చెకుముకి సైన్స్ 2023 సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులకు శాస్త్రీయ విధానంపై వ్యాసరచన పోటీలు నిర్వహించిన ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. అలాగే పాడేరులో ఏర్పాటు చేసే జిల్లా స్థాయి జన విజ్ఞాన వేదికలో పాల్గొనేందుకు వారిని ఎంపిక చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానవుల జీవితంతో సైన్స్ ముడిపడి ఉంటుందన్నారు. ప్రతీ పనిలోనూ సైన్స్ ఉంటుందని, అందుకే విద్యార్థులు ఆసక్తి చూపాలని చెప్పారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ఊలం వీరభద్రరావు, చోచలి చిట్టినాయుడు పాల్గొన్నారు.

శ్రమదానంతో వంతెన మరమ్మతులు


వంతెన మరమ్మతు పనులు చేపడుతున్న యువకులు

జి.మాడుగుల, జనవరి 3: మండలంలోని కుంబిడిసింగి పంచాయతీ కేంద్రానికి వెళ్లే మార్గంలో వంతెనను యువకులు శ్రమదానంతో మరమ్మతులు చేసుకున్నారు. వర్షా కాలంలో మత్స్య రాళ్లగెడ్డ ఉధృతి పెరగడంతో రవాణాకు పూర్తిగా అంతరాయం కలుగుతుందని, గెడ్డ ఉధృతికి గతంలో చాలా మంది ప్రమాదాల బారిన పడ్డారని, కొందరు కొట్టుకుపోయారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నిమార్లు ఉన్నతాధికారులకు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోయారు. దీంతో గత్యంతరం లేక తామే శ్రమదానంతో వంతెన మరమ్మతులు చేసుకున్నామని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ వంతెన నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని యువకులు టి.వెంకటరమణ, బి.మచ్చులు, పి.సింహాచలం, పి.రమణబాబు, టి.ప్రసాద్, ఏసయ్య కోరారు.

ఆరుగురు సారా విక్రయదారులపై కేసు

ముంచంగిపుట్టు, జనవరి 3: మండల కేంద్రంలో సారా విక్రయిస్తూ పట్టుబడిన ఆరుగురుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.రవీంద్ర తెలిపారు. బుధవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ స్థానిక సంతబయలు పరిసర ప్రాంతాల్లో నాటుసారా విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం వచ్చిందని, దీంతో ఆ ప్రాంతాన్ని ఆకస్మికంగా జల్లెడ పట్టగా ఆరుగురు పట్టుబడ్డారని చెప్పారు. సారా విక్రయిస్తున్న ఆరుగురిని పట్టుకొని 12 లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసులు నమోదు చేసి బుధవారం కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ముంచంగిపుట్టు, జనవరి 3: బాబుసాల పంచాయతీ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు జర్రెల సర్పంచ్ బొరగం భాగ్యవతి బుధవారం స్టడీ మెటీరియర్ పంపిణీ చేశారు. పలకలు, పుస్తకాలను అందించారు. అలాగే 20 మంది ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద గిరిజన విద్యార్థులకు తనవంతు సహకారం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశవరావు, నాయకులు అప్పారావు, ఆనందరావు, దొంబ్రూ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌వో మృతి

డుంబ్రిగుడ, జనవరి 3: కంద్రుం వీఆర్వో ఎం.మరియమ్మ మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి పరిస్థితి విషమించి ఆమె మృతి చెందినట్టు బాధిత కుటుంబీకులు తెలిపారు. తహసీల్దార్ నాగమ్మ, రెవెన్యూ సిబ్బంది మరియమ్మ స్వగ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.